క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ

సీతంపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం పరిశీలించారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో టెన్త్ పరీక్షలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. డీడీ అన్నదొర సైతం పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

జాబ్‌మేళా రేపు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ నేతృత్వంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 26 ఏళ్ల లోపు ఉండి పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో అర్హత గల యువతీయువకులు మేళాకు హాజరుకావాలన్నారు. విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు, బయోడేటా, రెండు ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

నిబంధనలు పాటించాల్సిందే..



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని ఏఎస్సై ధర్మారావు అన్నారు. సోమవారం స్థానిక పాలకొండ – విశాఖ రహదారిలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పెండింగ్ చలాన్‌లను వసూలు చేశారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్.శివన్నారాయణ

భామిని: మండల తహసీల్దార్‌గా ఎస్.శివన్నారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్. అప్పారావుకు గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా బదిలీ జరిగింది. బాధ్యతలు స్వీకరించిన శివన్నారాయణ సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.



తహసీల్దారు అప్పారావుకు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దారుగా ఎస్.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని అప్పారావు అన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పాలకొండ రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన జొన్నపాటి రాజు కొద్ది రోజులుగా కనిపించడం లేదు. దీంతో అతని భార్య సత్యవతి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ప్రయోగమూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రుద్రా ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజు గత నెల 2వ తేదీన డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంతో బయలుదేరాడు. అప్పటి నుంచి ఆయన కనపించకుండా పోయాడు. బంధువుల ఇళ్లల్లో.. సమీప గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అతని భార్య సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి పెన్షనర్ల సమస్యలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పెన్షనర్ల సంఘ మండల నాయకుడు కేవీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాల మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పెన్షనర్లు మాట్లాడుతూ.. తమకు 12వ పీఆర్‌సీ వర్తింపజేయాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులపై ఉచిత వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు అచ్యుతరావు, వి.గోవిందరావు, వెంకటనాయుడు, చిట్టిబాబు, పెదగాడ అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



జియ్యమ్మవలస: చినమేరంగిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా హాజరై, ప్రశాంతంగా పరీక్ష రాశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా స్క్వాడ్‌లను నియమించారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. తాగునీరు, వైద్య శిబిరం కూడా అందుబాటులో ఉంచుతున్నారు. -పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



గరుగుబిల్లి: పరీక్షల నిర్వహణపై ఆరాతీస్తున్న ఎంపీడీవో పైడితల్లి



పాలకొండ: పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



వీరఘట్టం: తొలిరోజు పరీక్ష రాసేందుకు వెళుతున్న కేజీబీవీ బాలికలను ఆశీర్వదిస్తున్న టీచర్లు



వీరఘట్టం : హైస్కూల్‌లో తొలి పరీక్ష రాస్తున్న విద్యార్థులు



గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు



పాలకొండ: పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్న పత్రాలు తీసుకువెళ్తున్న ఇన్విజిలేటర్లు



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరిలో హాల్‌టికెట్లు నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదు..

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: మండలంలోని తలవరంలో పాతికేళ్ల కిందట నిర్మించిన హెల్త్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు భవనాన్ని కూల్చేసి ఆక్రమించుకున్న వైనంపై ఈ నెల 16న సాక్షిలో 'కూల్చేసి.. కబ్జా చేసి..' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు సోమవారం బెజ్జి గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో హెల్త్ సెంటర్ భవనం ఉందా, లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. భవనం ఉన్నట్లు గ్రామస్తులు చెప్పారని తహసీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు.



సాక్షి
కూల్చేసి.. కబ్జాచేసి..

సాక్షిలో ప్రచురితమైన కథనం

అనంతరం హెల్త్ సెంటర్ భవనం కూల్చేసి పక్కనే ఉన్న రియల్ ఎస్టేట్ స్థలంలో కలిపేసుకున్న వారిని పిలిపించి మాట్లాడారు. భవనం ఉన్న 1.5 సెంట్ల స్థలాన్ని విడిచిపెట్టాలని రియల్‌ఎస్టేట్ యజమానిని తహసీల్దార్ ఆదేశించారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల కొరత

వీరఘట్టం: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు అలసటకు గురైనా, ఎండ దెబ్బ తగిలినా లేదా అస్వస్థతకు గురైనా వారికి వెంటనే ఉపశమనం కలిగించేందుకు వైద్యారోగ్యశాఖ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందిస్తుంది. అయితే వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో సోమవారం తొలి రోజు 146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అయితే వీరికి కోసం వైద్యారోగ్యశాఖ కేవలం 5 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను మాత్రమే అందుబాటులో ఉంచింది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద కూడా అరకొరగానే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచినట్లు తెలిసింది. ఈ విషయమై పరీక్ష కేంద్రాల వద్ద డ్యూటీలో ఉన్న హెల్త్ సిబ్బంది వద్ద ప్రస్తావించగా.. స్టాక్ లేనందున అందుబాటులో ఉన్న ప్యాకెట్లను మాత్రమే తీసుకువచ్చినట్లు చెప్పారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఎక్కువ మోతాదులో ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వీరఘట్టం జెడ్పీ హెచ్‌ఎస్ పరీక్ష కేంద్రం వద్ద అరకొరగా ఉంచిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు

ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేదెప్పుడు..?

సీతంపేట: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేదెప్పుడని ఎంపీపీ బి.ఆదినారయణతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ఆస్పత్రి నిర్మాణానికి రూ.49 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. అప్పట్లో పనులు చకచకా జరిగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎటువంటి పనులు ముందుకు సాగడం లేదన్నారు. కాగా ఉపాధి హామీ పనుల్లో కూడా జాప్యం జరుగుతోందని ఆరోపించారు. నూతన నిర్మాణాల శంకుస్థాపనలకు అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారన్నారు. కొత్త పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా, ఇంతవరకు పనులు ప్రారంభించలేదన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎస్.సుశీల, సిమ్మయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎస్.మంగయ్య, గణేష్, జి.కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, ఎస్.తవిటిరాజు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు

గరుగుబిల్లి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని వేతనదారులకు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని పెద్దూరులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనికి వచ్చిన వారికే మస్తరు వేయాలని, వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండు పూటలా పనులు చేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీవో గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గోపీనాథుని సన్నిధిలో భజనలు

భామిని: మండలంలోని లివిరిలో వెలిసిన గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలో సోమవారం ప్రత్యేక భజనలు నిర్వహించారు. ఒడిశాలో గుర్తింపు పొందిన హరేరామ నామ సంకీర్తన బృందాలు పలు కీర్తనలు ఆలపించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

రెండు అంగన్‌వాడీ కేంద్రాల మంజూరు

సీతంపేట: పీఎం జన్‌మన్ ప్రోగ్రాంలో భాగంగా మండలానికి రెండు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని సీడీపీఓ పి. రంగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిగువ బుడగరాయి, రేగులగూడ గ్రామాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటికి సంబంధించి ఈనెల 19న స్థానిక ఐటీడీఏ పీఓ చాంబర్‌లో హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదివరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ కార్యాలయానికి మంగళవారం వచ్చి కాల్ లెటర్లు తీసుకువెళ్లాలన్నారు.

వైద్యమిత్రల శాంతియుత నిరసన

పార్వతీపురంటౌన్: సమాన పనికి సమానవేతనం కల్పించాలని డాక్టర ఎన్టీఆర్ వైద్యమిత్రలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యమిత్ర కమలాకర్ మాట్లాడుతూ గత 19 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జీవో నంబర్ 28 రద్దు, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు పాల్గొన్నారు.

రెండు షాపులు దగ్ధం

సాలూరు: పట్టణంలోని రాయల్ ఫుడ్ హోటల్ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు షాపులు దగ్ధమయ్యాయి. హోటల్ సమీపంలో ఉన్న స్క్రాప్ దుకాణం, మరో దుకాణం సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బందికి వచ్చి మంటలను అదుపుచేశారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ, నీరు తాగుతున్న విద్యార్థులు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం సోమవారం ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నందు ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీటితో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి గంట శంకరనారాయణ, మజ్జి సింహాచలం, ఎల్.రమేష్‌నాయుడు, బొడ్డేపల్లి లక్ష్మీ నారాయణలు నిధులు సమకూర్చారని, వారికి అభినందనలు తెలిపారు.

పరామర్శ..



సీతంపేట మండలంలోని మామిడిచెట్టుగూడకు చెందిన వార్డు సభ్యుడు సవర రాజు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈమెతో పాటు ఎంపీటీసీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్, పార్టీనాయకులు ఎస్.రాము, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

వంశధారలో ఇసుక తవ్వకాలు

భామిని: మండలంలోని బిల్లుమడ – సింగిడి గ్రామాల మధ్య వంశధార నదిలో చేపడుతున్న ఇసుక తవ్వకాలను బిల్లుమడ మాజీ సర్పంచ్ శిగడాన రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. జేసీబీ సహాయంతో నదిలో ఉన్న ఇసుకను ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తవ్వకాలను అడ్డుకోగా.. జేసీబీ డ్రైవర్ హిందీలో మాట్లాడుతూ, అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దీంతో గ్రామస్తులు జేసీబీని అక్కడే ఉంచి తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించారు.



బిల్లుమడ - సింగిడి మధ్య వంశధారలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న జేసీబీ

ఘనంగా ఘటాల తిరువీధి



గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో శ్రీరేగాలమ్మ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారి ఘటాల తిరువీధి ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఘటాలను దర్శించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేషన్ పంపిణీ ఎప్పుడో?

కురుపాం మండలం, పి.లేవిడి గ్రామంలో రేషన్ పంపిణీ ఇంతవరకు జరగలేదు. ఎప్పుడూ నెల ఆరంభంలోనే రేషన్ సరుకులు ఇస్తుండగా, ఈ నెల 17 తేదీ వచ్చినా సరుకులు అందివ్వకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీనే రేషన్‌కు సంబంధించిన కూపన్లు ఇచ్చారని, అయినా ఇంతవరకు తమకు ఎటువంటి సరుకులు ఇవ్వలేదని, ఇలా అయితే ఎలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శి ద్వారా సేల్స్‌మేన్‌కు ఫోన్ చేయించినా ఆయన ఫోన్ ఎత్తడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
–గుమ్మలక్ష్మీపురం(కురుపాం
)



ఈ నెల 10న పి.లేవిడి గ్రామస్తులకు అందజేసిన రేషన్ సరుకుల కూపన్

బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నందొర సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల గదులు పరిశీలించి, కొన్నిచోట్ల టైల్స్ పగిలిపోవడాన్ని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తెలుగు పరీక్ష ఎలా రాశారో పదో తరగతి విద్యార్థినులను అడిగారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల ఉన్నారు.



పగిలిన టైల్స్ పరిశీలిస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జియ్యమ్మవలస: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.రఘు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించిన ఆయన.. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఓపీ ఎంత వచ్చింది.. మలేరియా జ్వర నిర్ధారణ పరీక్షలు ఎన్ని జరిగాయన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని మందుల నిల్వలను పరిశీలించారు. రోగులకు అవసరమైన వైద్యసేవలు సకాలంలో వారికి అందివ్వాలని సిబ్బందిని కోరారు. అక్కడి నుంచి వనజ గ్రామం వెళ్లి, అక్కడ 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వనజలో 104 సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి రఘు

శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

గరుగుబిల్లి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించి, పలు సమస్యల పరిష్కారానికి పలువురు సమర్పించిన అర్జీలను తహసీల్దారు పి.బాల స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు సమర్పిస్తున్న వినతుల్లో ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయని, వాటి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు బాల